నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 24 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI


మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగ సంఘం నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి ఉద్యోగుల వినతి

సూర్యాపేట అర్బన్, మార్చి 23 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రస్తుత అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. సూర్యాపేటలో ఆదివారం వారు జగదీశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా ఒత్తిడి తీసుకురావాలని, మహాలక్ష్మి పథకంతో ఉద్యోగులపై పెరిగిన పని ఒత్తిడిని తగ్గించాలని తెలిపారు. ఉద్యోగుల జీతాలు సవరించి పెంచే విధంగా చేయాలని, చిన్న చిన్న తప్పులకు ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీ ఉద్యోగులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, జి.ఏకాంబరం, బెల్లి నర్సయ్య, జక్కుల వెంకటేశ్వర్లు, జి.వెంకన్న, ఎ.శ్రీవర్ధన్‌రాజు ఉన్నారు.

నకిరేకల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఆంధ్రాకు నీళ్లు తరలిస్తుంటే చేతులు కట్టుకుంటున్నారు

- రుణమాఫీపై తాగుబోతులకంటే హీనంగా మాట్లాడుతున్నారు
- ఎండిపోయిన పంటలను పరిశీలించే దిక్కే లేదు
- పదో తరగతి పరీక్షా పత్రం లీక్‌లో అధికార పార్టీ నాయకులు
- విలేకరుల సమావేశంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మార్చి 23 : రేవంత్‌రెడ్డికి చంద్రబాబునాయుడు మీద ఉన్న ప్రేమ తెలంగాణ రైతాంగం మీదలేదని, ఆంధ్రాకు నీళ్లు తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి చేతులు కట్టుకుని చూస్తున్నారే తప్ప ఒక్క స్టేట్‌మెంట్ ఇచ్చిన దాఖలాలు లేవని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదోతరగతి పరీక్షా పత్రం లీక్‌లో అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఉన్నారని, మున్సిపల్ చైర్మన్ డ్రైవర్, మాజీ సర్పంచి డ్రైవర్, ఎమ్మెల్యేకు లెఫ్ట్, రైట్ ఉన్న వ్యక్తులే పేపర్ లీక్ చేశారని ఆరోపించారు. ఎంతో మంది కష్టపడి చదువుకున్న విద్యార్థుల భవిష్యత్‌ను ఆగం చేసే చర్యలు పాల్పడ్డారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీని కోరుతున్నామన్నారు. రెండు లక్షలు, ఆపై పంట రుణం తీసుకున్న వారికి రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చాలా సందర్భాల్లో చెప్పారని, కానీ అరకొర చేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు. 42 లక్షల మంది రైతన్నలు బ్యాంకుల్లో అప్పులు తీసుకుంటే 16.25 లక్షల మందికి రూ.20 కోట్ల మాత్రమే మాఫీ చేశారని, ఇంకా రూ.10 వేల కోట్లు చేయాల్సి ఉందని చెప్పారు. రూ.2 లక్షల పైన పంట రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయబోమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పడం ఎంత వరకు సమంజసమని అన్నారు. బాధ్యత గల పదవిలో ఉండి ముఖ్యమంత్రి, మంత్రులు తాగుబోతులు మాదిరిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రైతు భరోసాపై స్పష్టమైన వైఖరి లేదని విమర్శించారు. ఎన్నికల్లో కేసీఆర్ ఎకరానికి రూ.10 వేలు ఇస్తా అంటే రూ. 15 వేలు ఇస్తా అని గొప్పలు చెప్పుకున్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకూ రైతుభరోసా గానీ, రుణమాఫీ గాని సంపూర్ణంగా ఇవ్వలేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయని ప్రభుత్వం హడావుడిగా మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేసి అన్ని పథకాలు అందజేస్తామని ఇప్పటి వరకూ ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదని అన్నారు. టెక్నికల్ సమస్యలను సాకుగా చూపుతూ రుణమాఫీ కోసం రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పడం కరెక్ట్ కాదన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి చెరువులు, కుంటలు నింపకుండా ఈ సంవత్సరం కరువుకు, పంట పొలాలు ఎండిపోవడానికి కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటపొలాలను పరిశీలించే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదన్నారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్‌లో వరి కోతలు ప్రారంభమవుతున్నాయని, ప్రతి గింజ దళారుల చేతికి పోకుండా, సరిపడా గన్నీబ్యాగులు ఏర్పాటు చేయాలని, ధాన్యానికి బోనస్ ఇవ్వాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకూ బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, కౌన్సిలర్ పల్లె విజయ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకట్, నాయకులు సామ శ్రీనివాస్‌రెడ్డి, యానాల లింగారెడ్డి, గొర్ల వీరయ్య, దైద పరమేశం, రాచకొండ శ్రవణ్, అవిరెండ్ల జనార్దన్, కొండ వినయ్ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- లారీని ఓవర్‌టేక్ చేయబోయి కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- మరో ఎనిమిది మందికి గాయాలు..
- మృతుల్లో భార్యాభర్తలు, కూతురు

రవీందర్

రేణుక

రితిక

చివ్వెంల, మార్చి 23 : లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కారులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని బీబీగూడెం వద్ద ఆదివారం జరిగింది. మృతుల్లో ఒకే కుటుంబంలో భార్యాభర్తలు, కూతురు ఉన్నారు. కుమారుడి పరిస్థితి కూడా విషమంగా ఉంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంటయ్య పాలెంకు చెందిన గడ్డం రవీందర్(34).. తన భార్య గడ్డం రేణుక (29), కూతురు గడ్డం రితిక(7)తో కలిసి ఆదివారం స్విఫ్ట్ కారులో ఆత్మకూరు(ఎస్) మండలం కోటపహాడ్‌కు తన భార్య రేణుక మేనమామ కోతి జనార్దన్ ఇంటి వద్ద జరుగుతున్న ఉప్పలమ్మ పండుగకు వెళ్లారు. అక్కడ బంధువులతో కలిసి సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం భోజనం తరువాత కారులో హైదరాబాద్‌కు తన భార్య రేణుక, కూతురు రితిక, కొడుకు రిషి కృష్ణతో బయల్దేరారు. అలాగే కారులో నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఉంటున్న రవీందర్ బావమరిది గంధం మధు, అతని కూతురు గంధం సాన్విక, గంధం గగన్ చంద్, గంధం మల్లిఖార్జున్, రవీందర్ మరదలు కడారి పుష్ప, ఇద్దరు కుమారులు కడారి జస్విన్, కడారి హర్షిత్‌ను మార్గ మధ్యలో దింపి వెళ్లాలనుకున్నారు. ఈ క్రమంలో చివ్వెంల బీబీగూడెం వద్ద ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో మృతుడు రవీందర్ కుమారుడు రిషికృష్ణతో పాటు మరో ఇద్దరు చిన్నారులు జస్విన్, హర్షిత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు డీఎస్పీ రవి తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ కె. నరసింహా పరిశీలించారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం రిషికృష్ణతో పాటు మరో ఇద్దరు చిన్నారులు జస్విన్, హర్షిత్‌ను108వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవర్ వైపు ఉన్న భాగం పూర్తిగా దెబ్బతిని డ్రైవర్ రవీందర్ తల భాగం నుజ్జు అయింది.

చెప్పినప్పుడు ఆగి ఉంటే ఇంతటి ఘోరం జరిగేది కాదు

'పండుగ వాతావరణం అంతా అలానే ఉంది.. ఇంటికి వచ్చిన బంధువులు ఇంకా కోటపహాడ్‌లోనే ఉన్నారు.. పండుగకు వచ్చివెళ్తుండగా రవీందర్ కాసేపు ఉండి వెళ్లండి అని, ఎండ తగ్గిన తర్వాత వెళ్లండని అందరూ చెప్పారు.. కానీ వినలేదు.. మా మాటలు విని ఉంటే ఇంతటి ఘోరం జరిగి ఉండేది కాదు' అని బంధు మిత్రులు సూర్యాపేట జనరల్ ఆసుపత్రి వద్ద రోదిస్తున్న తీరును అక్కడికి వచ్చిన వారిని కంట తడి పెట్టించింది.

'పది' పేపర్ లీకేజీ వ్యవహారంలో ఆరుగురికి రిమాండ్

- కొనసాగుతున్న విచారణ
- పోలీసుల కస్టడీలో మరో ఐదుగురు

నకిరేకల్, మార్చి 23 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ వ్యవహారంలో 11 మందిని అరెస్ట్ చేయగా ఆదివారం ఆరుగురిని నల్లగొండ సీసీఎస్ నుంచి నకిరేకల్ కోర్టులో జడ్జి ముందు హాజరుపరిచారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏ1 చిట్ల ఆకాశ్, ఏ2 బండి శ్రీనివాస్, ఏ3 చిట్ల శివ, ఏ4 గుడుగుంట్ల శంకర్, ఏ5 బ్రహ్మదేవర రవిశంకర్, ఏ6 మైనర్ బాలుడిని నకిరేకల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ముందు హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు ఆరుగురికి రిమాండ్ విధించి జైలుకు పంపించారు. మిగిలిన ఐదుగురిని కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఇందులో ఓ వ్యక్తి వాట్సాప్‌లో ఫొటోలు తీయగా మరో వ్యక్తి జీరాక్స్ తీసినట్లు సమాచారం. మిగిలిన వ్యక్తులు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రానికి సంబంధించిన జవాబులను జీరాక్స్ తీసి పలువురికి పంపించినట్లు సమాచారం. మిగిలిన ఐదుగురిని విచారణ చేసి దశలవారీగా కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు. నిందితులను సీసీఎస్ నుంచి నకిరేకల్ కోర్టుకు తీసుకురాగానే వారి బంధువులు, తల్లిదండ్రులు కోర్టు వద్దకు భారీగా తరలివచ్చారు. నేడు, రేపో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేసి విచారించనున్నట్లు తెలిసింది.

పొట్టదశలో ఎండుముఖం

తుంగతుర్తి నియోజకవర్గంలో తీవ్ర కరువుచాయలు

సాగు నీళ్లు లేక వాడిపోతున్న వరిపొలాలు

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీ కాల్వలకు రాని నీళ్లు

అడుగంటుతున్న భూగర్భ జలాలు.. వట్టిపోతున్న బోర్లు

ఇప్పటికే ఎండిన సగం పంటలు.. పశువులకు మేతగా వదిలివేత

తుంగతుర్తి నియోజక వర్గంలో కరువుచాయలు అలుముకున్నాయి. చెరువులు, కుంటలు, బోర్లు వట్టి పోతున్నాయి. వేల రూపాయలు అప్పులు తెచ్చి గతంలో మాదిరిగా ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీరు అందుతుందనే ఆశతో అన్నదాతలు 90 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరి పొలాలకు సాగునీరు అందక 30 శాతం ఎండిపోగా రైతులు పశువులు, మేకలు, గొర్రెలను మేపుతున్న దుస్థితి నెలకొంది.

– తిరుమలగిరి, మార్చి 23

తిరుమలగిరి : తుమ్మలకుంట తండాలో నీటికోసం వ్యవసాయ బావిలో పూడిక తీత

2012 పరిస్థితులు పునరావృతం

సమైక్య రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మళ్లీ పునరావృతం అవుతుండటంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. రెండు నెలలు అయితే పంట చేతికి అందుతుందనగా కరువు పరిస్థితులు రైతులను కలవర పెడుతున్నాయి. కనీసం పెట్టుబడి కూడా రాని దుస్థితి ఏర్పడింది. ఎస్సారెస్పీ ఆయకట్టు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. నియోజక వర్గంలోని దాదాపు 300లకు పైగా చెరువులు నీళ్లు లేక ఎండుముఖం పట్టాయి. నిండుగా పోసే బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. 200 ఫీట్లు లోతు బోర్లు వేసినా చుక్క నీరు రావడం లేదు. ఇక పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి.

నాన్ ఆయకట్టులోనూ అవస్థలు

నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో సైతం భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు వట్టి పోతున్నాయి. పంటలు కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. తిరుమలగిరి మండలంలో చాలా చోట్ల రైతులు అప్పులు చేసి వ్యవసాయ బావుల్లో పూడికలు తీస్తున్నారు. పొట్ట దశలో ఉన్న పొలాలను కాపాడుకునేందుకు బోర్లు వేయించినా ఫలితం ఉండక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

శాలిగౌరారం : బైరవునిబండ శివారులో ఎండిన పొలంలో బర్లను మేపుతున్న రైతు

పంటంతా పశువుల పాలు

ఎండిన వరి చేనులో బర్లను మేపుతున్న ఈ రైతు పేరు మండ్ర సింహాద్రి. ఊరు శాలిగౌరారం మండలం బైరవునిబండ. నాలుగెకరాలు భూమి ఉండగా, నీళ్లు సరిపోతయో లేవోనని ఎకరన్నరలోనే రెండు బోర్ల ఆధారంగా వరి సాగు చేశాడు. పంట చేతికి వచ్చే దశలో బోర్లు ఎండిపోవడంతో పంటను కాపాడుకునేందుకు మరో రెండు బోర్లు వేయించాడు. అయినా నీళ్లు పడక పంటంతా ఎండిపోయింది. చేసేదిలేక పొలంలో బర్లను మేపుతున్నాడు. కండ్ల ముందు ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని సింహాద్రి ఆవేదన వ్యక్తం చేశారు.

-శాలిగౌరారం

పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు

ఏడు ఎకరాల్లో వరిసాగు చేసిన. ఇప్పటి వరకు 2.5 లక్షల రూపాయలు పెట్టిబడి పెట్టిన. గత సంవత్సరం బోరు కూడ వేసిన. అయినా నీళ్లు లేక వరి పంట ఎండుముఖం పడుతున్నది. చేసేది లేక పైపుల ద్వారా వరుస తడులు వేస్తున్నా. మూడు నాలుగు రోజులకు ఒక మడి తడుస్తుంది. వారం క్రితం 30 వేలు పెట్టి బోర్లు కడిగించిన అయినా ఫలితం లేదు. పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం సంతోషంగా చేసినం. ఇలాంటి పరిస్థితులు వస్తాయని ఊహించ లేదు.

-బోయిని కొమరమల్లు, రైతు, తిరుమలగిరి

ఆరుతడి పంట కూడా ఎండుతున్నది

నాకున్న 8 ఎకరాల్లో 4 ఎకరాలు పత్తి వేసిన. యాసంగి నీటి సమస్య ఉంటదేమో మిగతా నాలుగు ఎకరాల్లో వరికి బదులు మొక్కజొన్న వేసిన. అయినా నీళ్లు అందక మొక్కజొన్న చేను ఎండుతున్నది. పంట కాపాడు కోవడానికి వేల రూపాయలు పెట్టి బావిలో పూడిక తీయిస్తున్నా. అయినా పంట చేతికి అందుతనే నమ్మకం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- గోపాల్, రైతు, తుమ్మలకుంట తండా, తిరుమలగిరి

3 నుంచి 16 మీటర్లకు పడిపోయిన భూగర్భ జలాలు

తిరుమలగిరి మండలంలో అత్యంత వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు. కాల్వలకు జలాలు రాక, చెరువులు, కుంటలు ఎండిపోయి భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. తిరుమలగిరి మండలంలో గత సంవత్సరం 3.69 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు ప్రస్తుతం 16.71 మీటర్లకు పడిపోయాయి. నీళ్లు లేక పంటల ఎండిపోతుండడంతో రైతులు రైతులు మూడు నాలుగు రోజులకు ఒక్కసారి వరుస తడులు పెట్టి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజానాయక్ తండా, నందపురం గ్రామ ఆవాసం రామునిబండ తండా రైతులు వ్యవసాయ బావుల్లో పూడికతీతలు చేపట్టారు.

శాలిగౌరారం మండలం వద్దింపాముల గ్రామంలో నిమ్మతోటకు ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు పోతయ్య

నిమ్మ తోటకూ నీళ్లు లేవు

శాలిగౌరారం : వరి పొలాలతో పాటు నిమ్మతోటకు కూడా నీళ్లు లేవు. మార్చిలోనే భూగర్భజలాలు ఎన్నడూ లేనంతగా అడుగంటిపోవడంతో బోర్లు ఆగిఆగి పోస్తున్నాయి. రైతులు నిమ్మతోటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. నెలకు రూ.15వేలు అద్దె చెల్లించి ట్యాంకర్‌తో నీళ్లు పోయించి బతికించుకుంటున్నారు. శాలిగౌరారం మండలం తక్కెళ్లపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని వద్దింపాముల గ్రామానికి చెందిన రైతు భీమనబోయిన పోతయ్య రెండున్నర ఎకరాల భూమిలో 12 ఏండ్లుగా నిమ్మతోటను సాగు చేస్తున్నాడు. రెండు బోర్ల ద్వారా సరిపడా నీరందినప్పటికీ మునుపెన్నడూ లేనంతగా ప్రస్తుతం రెండు బోర్లు అడుగంటిపోయాయి. కండ్ల ముందే నిమ్మ చెట్లు వాడిపోతుంటే తట్టుకోలేని పోతయ్య నెలకు రూ.15వేలు అద్దె చెల్లించి ట్యాంకర్‌ను తీసుకున్నాడు. తనకున్న ట్రాక్టర్ సహాయంతో ట్యాంకర్ ద్వారా బంధువుల వ్యవసాయ బోరు రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తీసుకొచ్చి నిమ్మచెట్లకు నీటిని పెడుతున్నాడు. తీరుస్తున్నాడు. ఒక్క ట్యాంకర్ నీళ్లు 6నుంచి 7చెట్లకు మాత్రమే సరిపోతున్నాయని రైతు ఆవేదనతో చెప్పుకొచ్చాడు. మొత్తం 160చెట్లకు గానూ ఒక్క తడి తిరిగే సరికి వారం రోజులు పడుతుందని తెలిపాడు. మండలంలో మొత్తం 12ఎకరాల్లో నిమ్మ, బత్తాయి తోటలను రైతులు సాగు చేశారు.

పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్‌తో నీళ్లు

మోత్కూరు మండలం ముశిపట్లలో వరి పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు కెమిడి ముత్యాలు

మోత్కూరు : భూగర్భ జలాలు అడుగంటి చేతికి వచ్చిన వరి పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. కొద్దోగొప్పో సాగు చేసిన వరినిగకాపాడు కోవడం కోసం రైతులు నీటి ట్యాంకర్‌తో పొలాన్ని తడుపుతున్నారు. మోత్కూరు మండలంలోని ముశిపట్లకు చెందిన రైతు కెమిడి ముత్యాలు నిత్యం ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీటిని తెచ్చి పొలాన్ని కాపాడుతున్నాడు. అతను మూడు ఎకరాల్లో వరి సాగు చేయగా, పంట చేతికి వచ్చే దశలో నీళ్లు అందడం లేదని వాపోయాడు. ఎండిపోతున్న పంటను కాపాడుకోవడం కోసం రోజుకు 15 ట్యాంకర్లతో నీళ్లను తెచ్చి పోస్తున్నట్లు తెలిపాడు. మూడు ట్యాంకర్లతో 10 గుంటల వరి పొలం తడుస్తుందని, డబ్బులు ఖర్చు అయినా చేతిలో మిగిలేది ఏమీ ఉండదని ఆవేదన వ్యక్తం చేశాడు.

4 ఎకరాలకు 30 గుంటలే మిగిలింది

నాలుగు ఎకరాలు వరిసాగు చేస్తే అంతా ఎండిపోయి 30 గుంటలు మాత్రమే కష్టకష్టంగా వరుస తడులతో పారుతున్నది. 2 లక్షల వరకు పెట్టిబడి పెట్టి మూడు బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు. గతంలో ఎస్సాఎస్పీ కాల్వల ద్వారా పైపులు వేసుకొని పంటలు పండించుకునే వాళ్లం. ఉన్న బోర్లు కూడా నిండుగా నీళ్లు అందించేవి. ప్రస్తుతం బోర్లు ఎండిపోయి నీళ్లు లేక వేసిన వరి పంట ఎండుతున్నది. ఈ ప్రభుత్వం రైతులను పట్టించుకుంట లేదు .

-శ్రీను ముదిరాజ్, చింతకుంట తండా, తిరుమలగిరి

చింతలకుంట తండాలో ఎండిపోయిన పొలం కూర్చొని కన్నీరు పెట్టుకుంటున్న రైతు సోడా శ్రీనుముదిరాజ్

తిరుమలగిరి : మామిడాల గ్రామంలో వరి పైరు ఎండిపోవడంతో పశువులను మేపుతున్న రైతు బొడ్డు సైదులు

నాలుగు ఎకరాలు ఎండిపోయింది

నేను యాసంగిలో 8 ఎకరాలు వరిసాగు చేసిన. ప్రస్తుతం 4 ఎకరాలు ఎండిపోయింది. పశువులకు మేతగా మారింది. ఉన్న నాలుగు ఎకరాలైన కాపాడుకోవాలని 3 బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు. 20 వేలు పెట్టి బోరు శుభ్రం చేయించినా ఉపయోగం లేదు. 3 లక్షల వరకు పెట్టుబడి పెట్టినా కనీసం పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొంది. ఉన్న కొద్దిపాటి వరిపొలానికి 4 రోజులకు ఒక మడి చొప్పున వరుస తడులు పెడుతున్నా కరెంట్ సక్రమంగా రాక పోవడంతో చివరి మడి వరకు నీరు అందడం లేదు. ఇంకా 20 రోజులు నీరు అందాలి. కానీ అలాంటి పరిస్థితులు లేవు. ఈ ప్రభుత్వం వచ్చి కరువు తెచ్చింది. ఎస్సారెస్పీ కాల్వల్లో నీళ్లు ఉంటే భూగర్భ జలాలు పెరిగేవి. కేసీఆర్ హయాంలో రైతులకు ఏ బాధలు లేవు.

-బొడ్డు సైదులు, మామిడాల, తిరుమలగిరి

చుక్క నీరు లేక.. దీనావస్థ

తుంగతుర్తిలో ఎండిపోయిన పంట చేనులో బర్లెలను మేపుతున్న మహిళా రైతు

తుంగతుర్తి : మండల వ్యాప్తంగా నీళ్లు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో ఎండిపోతుండడంతో అన్నదాతలు కంటతడి పెడుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పైరు ఎండిపోవడంతో చేసేదేమీ లేక బర్లు, గొర్రెలను మేపుతున్నారు. మిగిలిన కాస్త పంటలకైనా ఎస్సారెస్పీ కెనాల్ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలను అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నీళ్లు వస్తాయని ఆశతో సాగు చేశాం

ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు వస్తాయని ఆశతో ఐదెకరాల్లో వరి సాగు చేసిన. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టిన. ప్రభుత్వం నీళ్లు అందించలేకపోవడంతో ఇప్పటికే సగం పంట ఎండిపోయి పశువులకు మేతైంది. మిగిలిన పంటకైనా నీళ్లు అందించి ఆదుకోవాలి. లేకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం.

-పోలేటి మల్లయ్య రైతు తుంగతుర్తి

రెగ్యులర్‌గా ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వాలి

ప్రస్తుతం వరి పొలాలు పొట్ట దశలో ఉండడంతో నీళ్లు చాలా అవసరం. ఎస్సారెస్పీ కాల్వకు వారబందీ విధానంలో నీటిని విడుదల చేయడంతో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పొలాలకు నీళ్లు అందడం లేదు. 15రోజులపాటు వరుసగా సాగునీటిని అందిస్తేనే పంటలు చేతికొస్తాయి. ఇచ్చిన షెడ్యూల్ కూడా సవరించి ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించాలి.

కన్నెబోయిన మల్లేశ్, రైతు, నాగారం బంగ్లా

నూతన్‌కల్‌లో నీళ్లు లేక ఎండిపోయిన ఎస్సారెస్పీ కాల్వ